## చందూర్‌లో మొదలైన హోలీ సంబురాలు



చందూర్, బతుకమ్మ :చందూరు మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద ఆదివారం కారేగాం తాండా గిరిజనులు సాంప్రదాయ కోలాటాలు నిర్వహించారు. హోలీ పండుగకు ముందు రోజు తాండాలలో లెంగి వేయడం ఆనవాయితీగా కొనసాగుతోందని కారేగాం తాండా సర్పంచ్ డాక్టర్ రామావత్ లాల్ సింగ్ తెలిపారు. ఈ కోలాటాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గిరిజనుల సంప్రదాయ వేషధారణ, ఉత్సాహభరిత నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు చత్రు సింగ్ చందూర్ సర్పంచ్ మాధవ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ చంద్రు నాయక్, నాయక్ రాం బాబు, కార్భారి దళ్ సింగ్, దేవి సింగ్ , అంబర్ సింగ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించిన మండల యువకుడు

భిక్కనూరు, బతుకమ్మ :బెంగళూరులో కర్ణాటక పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన పది కిలోమీటర్ల పరుగు పందెంలో కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఎస్కే షాదుల్లా పాల్గొని గోల్ మెడల్ సాధించినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన షాదుల్ కర్ణాటక పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించి అక్టోబర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని తెలిపారు. గ్రామానికి చెందిన యువకుడు జాతీయ స్థాయి పరువు పందెం పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.



## పదవి విరమణ పొందిన సుదర్శన్‌కు ఘన సన్మానం



రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం స్టాఫ్ మెంబర్ ఈగ సుదర్శన్ పదవి విరమణ పొందిన సందర్భంగా ఆదివారం ఈగ సుదర్శన్ కుమారుల మిత్రులు పుష్ప గుచ్చం అందజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఈర్వ నాగరాజు, వడ్ల గంగాశేఖర్, ఈర్వ క్రాంతి, బొద గంగాధర్, ఈర్వ అవినాష్, ఈగ రవి, ఈగ వినిత్ కుమార్, ఈగ వినయ్ కుమార్, ఈర్వ అనిరుద్, ఈర్వ శ్రావణ్, ఈగ వినాయక సాయి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల పరిధిలోని దేవి తండా గ్రామ శివారులో ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన చెవుల చిన్నయ్య (50) వ్యవసాయ పొలానికి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుండి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రున్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జి సందీప్ తెలిపారు. మృతుని భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్.ఐ జి సందీప్ తెలిపారు.



# మహిళల ఉపాధిపై దెబ్బ తీస్తే ఊరుకునేది లేదు

### పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వి. గోదావరి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : మహిళల ఉపాధి పై దెబ్బతీస్తే మహిళలు, పేద ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తారని పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి అన్నారు. ఆదివారం కోటగల్లి లోని ఎన్ ఆర్ భవన్ లో పిఓడబ్ల్యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8న జరగబోయే అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్నివిజయవంతం చేయాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. గోదావరి, ఏ. సంధ్యారాణి మాట్లాడుతూ మార్చి 1 నుండి 8 వరకు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పేద మహిళలకు చేయూతనిచ్చే ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం రద్దు చేయడానికి కుట్రలు పన్నుతున్నదని ఈ రద్దుకు వ్యతిరేకంగా మహిళల యొక్క ఉపాధిని కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రజలను, ప్రజాస్వామిక వాదులను కోరారు.



ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు నాగమణి, కోశాధికారి విపాష, జిల్లా నాయకులు కీర్తన, సునంద, నర్సక్క, రెహానా, ఆశలత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవడమే అమరవీరులకు అర్పించే ఘనమైన నివాళి

### వర్గీకరణ అమలు చేసి అమరుల ఆశయాలను సాధించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

### కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్ బతుకమ్మ : ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలవడమే మాదిగ అమరవీరులకు అర్పించే ఘనమైన నివాళి అని కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్ రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం టీఎంఆర్ పీఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా లో మాదిగ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన అనేక ఉద్యమ ఘట్టాలలో వీరోచితమైన పాత్రను పోషించి, జాతి లక్ష్యాన్ని సాధించడం కోసం తృణప్రాయంగా తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించి నేలరాలిన మాదిగ అమరవీరుల



స్ఫూర్తి తోనే రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ అమలు చేసిందని అన్నారు. అంతే కాకుండా మంత్రి దామోదర రాజనర్సింహ అమర వీరుల కుటుంబాల ఇండ్లకు వెళ్ళి వారి పాదాలు కడిగి రూ.5 లక్షలు అందజేసి, వారి కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. అనంతరం టీఎంఆర్ పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లని శివ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించడం కోసం నడిచిన పోరుబాటలో అనేకమంది బిడ్డలు అసువులు బాసారన్నారు. నాడు వారి అమరత్వం సాక్షిగా వర్గీకరణను సాధిస్తామని ప్రమాణం చేశామని, నేడు ఆ ప్రమాణం సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధించి అమరుల ఆశయాలను నెరవేర్చామని అన్నారు. వర్గీకరణ అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ మాదిగ అమరవీరుల స్థూపం కొరకై 2000 గజాల స్థలం హైదరాబాద్ నగరంలో కేటాయించాలని, అలాగే వర్గీకరణ కోసం ఉద్యమాలు చేసిన ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని, అలాగే వారికి 250 గజాల స్థలాన్ని కేటాయించాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలోనే టీఎంఆర్ పీఎస్ వ్యవస్థాప అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ నేతృత్వంలో ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్ పీఎస్ పట్టణ అధ్యక్షులు మల్లేష్ మాదిగ, మహిళా సమైక్య నగర అధ్యక్షురాలు బంటు జ్యోతి మాదిగ, మాదిగ ఉద్యోగస్తుల సంఘం మైసయ్య, రాములు, రమేష్ టీఎంఆర్ పీఎస్ సీనియర్ నాయకులు తెడ్డు గంగారం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలపై, ప్రజలపై దాడి చేసే హక్కు ఎవరిచ్చారు

### సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య

### ఇరాన్ పై అమెరికా దాడిని ఖండిస్తూ ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రపంచ దేశాలపై, ప్రజలపై దాడి చేసే హక్కు అమెరికా సామ్రాజ్య వాదానికి ఎవరిచ్చారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య ప్రశ్నించారు. ఇరాన్ దేశంపై అమెరికా ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ ఆదివారం నిజామాబాద్ నగరంలో గాయత్రి నగర్ చౌరస్తాలో సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా దాని తొత్తు ఇజ్రాయెల్ ఇటీవల పశ్చిమ ఆసియాపై తమ దాడులను తీవ్రంగా కొనసాగిస్తున్నదని, దీని పరాకాష్టయే నేడు కొనసాగిస్తున్న ఇరాన్ పై దాడి అని, అక్రమంగా దాడులు, చంపడాలు వీరు చెప్పే ఉగ్రవాదుల దాడుల కంటే ఇవి లక్షలరెట్లు మిన్న అన్నారు. ప్రపంచ దేశాలపై ఆధిపత్యం కోసం ఆ



దేశ వనరుల కోసం దాడులు చేస్తున్నారని, ఇప్పటికే వెనీజుల అధ్యక్షుడిని అమెరికా కిడ్నాస్ చేసిందని, ఆ దేశ ఆయిల్ ని తను కంట్రోల్ కి తెచ్చుకున్న దన్నారు. ఇప్పుడు ఇరాన్ పై పడిందనీ, అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ పై దాడిని ఉపసంహరించుకోవాలనీ, మోడీ ప్రపంచ శాంతి కోసం ఈ యుద్ధోన్మాద చర్యను ఖండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, న్యూడెమోక్రసీ నాయకులు జేపీ గంగాధర్, శివకుమార్, ఆకుల అరుణ, వేల్పూరు లక్ష్మి, నీలం లక్ష్మి, సంజన, పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పి డి ఎస్ యూ నగర అధ్యక్ష కార్యదర్శులు నీలం లక్ష్మి, జి సంజన, పిడిఎస్ యూ నగర అధ్యక్షులు సిర్రం పవన్ కుమార్, రమేష్, దాసు, మల్లేష్, శంకర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.